సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 14 । జూలై । 2025



వైన్‌షాప్‌లో చోరీ

గుర్తు తెలియని వ్యక్తులు వైన్ షాప్‌లో చోరీకి పాల్పడిన సంఘటన షాబాద్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. 8లో▸



వర్షాలు కురవాలని..

వర్షాలు కురవాలని షాబాద్ మండలం ముద్దెంగూడ గ్రామ రైతులు వరద పాశం పోసి వరుణదేవుడిని వేడుకున్నారు. 8లో▸



ఇబ్రహీంపట్నం: మహంకాళి అమ్మవారు

న్యూస్‌రీల్

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న బొల్లు మహేందర్

ఆమనగల్లు: ధ్యానం చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడంతో పాటు ఆరోగ్యాన్ని పొందొచ్చని అంతర్జాతీయ మానవహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు మహేందర్ అన్నారు. పట్టణంలోని గ్రంథాలయ ఆవరణలో ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్యానికి ధ్యానం ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. వారానికి మూడు రోజుల పాటు ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ధ్యాన గురువులు, ధ్యానులు పాల్గొన్నారు.

బీసీల పోరాటంతోనే రిజర్వేషన్లు



ఆర్.కృష్ణయ్య చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీసేన నాయకులు

షాబాద్: బీసీలు చేపట్టిన పోరాటాలతోనే ప్రభుత్వం స్పందించి 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తామని ప్రకటించిందని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో చేపట్టిన ఉద్యమ ఫలితంగా స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు పెరిగాయని పేర్కొన్నారు. బీసీల హక్కుల సాధనకు ఆయన ఎంతో కాలంగా పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీసీసేన మండల అధ్యక్షుడు కమ్మరి దయాకర్‌చారి, జిల్లా ఉపాధ్యక్షుడు మేకల వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, మండల ఉపాధ్యక్షుడు బాలరాజ్, మండల యువజన విభాగం అధ్యక్షుడు బండ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి కొండా సురేఖ పర్యటన

పరిగి: పట్టణంలోని ఎస్సీ కాలనీలో నిర్మించిన సీతారామాలయం, బహర్‌పేట్ బీసీకాలనీలో పోచమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవానికి సోమవారం ఉదయం 11 గంటలకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విచ్చేయనున్నట్లు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11.30 గంటలకు పట్టణ కేంద్రంలోని శ్రీనివాస్ కాలనీలో వనమహోత్సవం, మధ్యాహ్నం 1.30 గంటలకు కుల్కచర్ల మండలం బండవెల్కిచర్లలోని పాంబండ రామలింగేశ్వర స్వామి దర్శనం, వన మహోత్సవంలో పాల్గొని బహిరంగ సభలో ప్రసంగిస్తారని చెప్పారు.

ఎయిర్‌పోర్టులో వోల్వోకారు దగ్ధం



శంషాబాద్: నిలిపి ఉన్న వోల్వో కారులో మంటలు చెలరేగి దగ్ధమైన సంఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చోటు చేసుకుంది. ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు సీఐ బాలరాజు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం వోల్వోకారులో వచ్చిన శ్రీకాంత్‌చౌదరి అనే వ్యక్తి సీఐఎస్‌ఎఫ్ చెక్‌పోస్టు వద్ద కారును నిలిపాడు. ఆ తర్వాత కొద్ది సేపటికే ఒక్కసారిగా ఇంజిన్ నుంచి మంటలు రావడంతో ఆయన వెంటనే కిందికి దిగిపోయాడు. క్షణాల్లో కారు ముందు భాగం పూర్తిగా తగులబడిపోయింది. పోలీసులు ఫైరింజన్‌ను రప్పించడంతో మంటలను ఆర్పివేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్స్‌లో కోలుకుంటున్న కల్తీ కల్లు బాధితులు

లక్డీకాపూల్: కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో అనారోగ్యం పాలైన బాధితులు కోలుకుంటున్నారని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన నిమ్స్ ట్రామా బ్లాక్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 26 మంది చికిత్స పొందుతున్నట్లు నిమ్స్ వైద్యులు తెలిపారు.



చేవెళ్ల : టీచర్స్ కాలనీలో బోనాల ఊరేగింపు

❖ బోనమెత్తిన పల్లె

దప్పుల ధరువులు.. శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాలు.. యువకుల కేరింతలు, నృత్యాలు.. ఎటు చూసినా కోలాహలం. ఆదివారం జిల్లాలోని పలు గ్రామాల్లో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకున్నారు. అమ్మవార్లకు భక్తిప్రపత్తులతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది.



చేవెళ్ల : బోనాల ఉత్సవాల్లో పోతురాజుల విన్యాసం

రూపుమార్చ బడి

- అనాథ పిల్లలకు హైటెక్ చదువులు
- అందాల భామల ఆర్థిక సహాయం
- కొత్త హంగులతో వీఎం హోం
- కంప్యూటర్లు, డిజిటల్ బోర్డులతో బోధన
- ఆసక్తిగా నేర్చుకుంటున్న విద్యార్థులు



డిజిటల్ క్లాస్ రూమ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

హుడాకాంప్లెక్స్: అనాథల ఆశ్రమ పాఠశాల (విక్టోరియా మెమోరియల్ హోమ్స్) హైటెక్ హంగులు సంతరించుకుంది. సంప్రదాయ బోధన, అధ్యయనానికి భిన్నంగా తరగతి గదుల్లో అత్యాధునిక కంప్యూటర్లు, డిజిటల్ బోర్డులు వచ్చి చేరాయి. ఇటీవల హైదరాబాద్ వేదికగా నిర్వహించిన మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన అందాల భామలు అందించిన చేయూతతో అనాథలకు హైటెక్ చదువులు చేరువయ్యాయి.

డిజిటల్ క్లాసురూములు

చారిత్రక సరూర్‌నగర్ విక్టోరియా మెమోరియల్ హోమ్‌లో తొమ్మిది వందల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. తల్లిదండ్రులు లేనివారితో పాటు సింగిల్ పేరెంట్ పిల్లలు కూడా ఇక్కడ ఉంటున్నారు. ఇప్పటివరకు వీరికి సంప్రదాయ పద్ధతుల్లోనే విద్యాబోధన కొనసాగింది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండేది కాదు. అనాథ పిల్లలకు తమవంతు సాయం అందించాలనే ఉద్దేశంతో మిస్ వరల్డ్ పోటీల నిర్వాహకులు.. 40 కంప్యూటర్లు, ఫర్నిచర్, డిజిటల్ ప్రొజెక్టర్లు, 75 ఇంచుల టీవీలు సహా పలు విద్యుత్ పరికరాలను అందజేశారు. సాధారణ బోర్డుల స్థానంలో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేశారు. అర్థం కాని అంశాలపై ఆన్‌లైన్‌లో రికార్డు చేసి ఉంచిన పాఠాలను ప్రొజెక్టర్లపై వేసి వివరిస్తున్నారు. వీటిని పిల్లలు సులభంగా అర్థం చేసుకుంటున్నారు.

❝ బేసిక్స్ నేర్చుకుంటున్నాం



ఇంటర్, డిగ్రీ స్థాయిలో నేర్చుకునే అంశాలను కంప్యూటర్ల ద్వారా ఇప్పుడే నేర్చుకునే అవకాశం కలిగింది. అర్థం కాని అనేక అంశాలు.. దీని ద్వారా సులభంగా అవగతం చేసుకోగలుగుతున్నాం. పైసా ఖర్చు లేకుండానే కంప్యూటర్ విద్యను నేర్చుకుంటున్నాం. చాలా ఆనందంగా ఉంది.

– అక్షిత, 8వ తరగతి

రోజుకు గంట చొప్పున..



అనాథలు హోమ్ నుంచి బయటకు వెళ్లిన తర్వాత సొంత కాళ్లపై నిలబడేందుకు కంప్యూటర్ కోర్సులు దోహదం చేస్తాయి. సాధారణ పాఠ్యాంశాలతో పాటు టైపింగ్, వర్డ్, ఎంఎస్ ఆఫీస్, గ్రాఫిక్స్ డిజైన్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాం. ప్రస్తుతం ఐదు నుంచి పదో తరగతి వరకు కంప్యూటర్లపై రోజుకు గంట పాటు పాఠాలు బోధిస్తున్నాం.

– శివప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్

ఎంతో ఉపయుక్తం



ఖాళీ సమయంలో కంప్యూటర్‌లోనే స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు వింటున్నాం. సైన్స్, సోషల్‌కు సంబంధించిన అనేక అంశాలను వీడియోల ద్వారా అర్థం చేసుకోగలుగుతున్నాం. కంప్యూటర్లు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి. – తేజస్విని, 8వ తరగతి

సులభంగా అర్థమవుతోంది



టీచర్ చెప్పిన అంశం గతంలో సరిగ్గా అర్థం అయ్యేది కాదు. డిజిటల్ క్లాసురూమ్‌తో ప్రస్తుతం సులభంగా అర్థం చేసుకోగలుగుతున్నాం. – చరితసాయి, 8వ తరగతి

తెలంగాణలో బీజేపీ బలంగా ఉంది



స్థానిక నాయకులతో సోము వీర్రాజు

ఎమ్మెల్సీ సోము వీర్రాజు

ఆమనగల్లు: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని పార్టీ కార్యాలయానికి ఆదివారం విచ్చేసిన ఆయనకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం సోము వీర్రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ బలంగా ఉందని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కండె హరిప్రసాద్, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కల్వకుర్తి బీజేపీ కో కన్వీనర్ నర్సింహ, బీజేవైఎం కో కన్వీనర్ రవిరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



రిలే దీక్షలో పాల్గొన్న కేఎస్ రత్నం తదితరులు

మొయినాబాద్: ఎనికేపల్లి రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. గోశాల ఏర్పాటుకు ప్రతిపాదించిన ఎనికేపల్లి భూముల వద్ద రైతులతో కలిసి ఆదివారం ఏడో రోజు రిలే దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల పొట్టగొట్టి గోశాల ఏర్పాటు చేయాలని చూస్తోందని విమర్శించారు. ఎనభై ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములను ఎలా వదులుకుంటారని ప్రశ్నించారు. గోశాల పేరుతో ప్రభుత్వం భూ దందా చేస్తోందని ఆరోపించారు. దీక్ష చేపడుతున్న రైతులు, మాజీ ఎమ్మెల్యే రత్నంకు శంకర్‌పల్లి మండల బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ససవెల్లి ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు సుధీంద్ర, నీలకంఠం, లక్ష్మీపతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటుడు అలీ తదితరులు

ఇంటి స్థలాల పంపిణీ

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ శివారులో ఆర్ట్ డైరెక్టర్ విభాగంలో పనిచేసే వారికి ఇంటి స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని ఆర్ట్ డైరెక్టర్ అధ్యక్షుడు రమణవంక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సినీ నటుడు అలీ 172 మందికి 200 గజాల చొప్పున ఇంటి స్థలాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ల సభ్యుల అభ్యున్నతికి తోడ్పడటం అభినందనీయమని పేర్కొన్నారు. తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2017లో సర్వే నంబర్లు 570, 571లో 11.07 ఎకరాల వ్యవసాయభూమిని కొనుగోలు చేసింది. ఈ భూమిలో గతంలోనే ప్లాట్లు చేసినప్పటికీ ఎల్‌ఆర్‌ఎస్ పూర్తి కాకపోవడంతో పంపిణీ ప్రక్రియ నిర్వహించలేదు. ప్రభుత్వం నాన్‌లేఅవుట్ ప్లాట్లకు ఎల్‌ఆర్‌ఎస్ అవకాశం కల్పించడంతో అసోసియేషన్ సద్వినియోగం చేసుకుంది. కార్యక్రమంలో తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర ప్రసాద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల, మల్లేష్ యాదవ్, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు రొల్ల రఘురాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రె కాపరుల సమస్యలు పరిష్కరించాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఖిల్లా గోపాల్



మహాసభలో మాట్లాడుతున్న గోపాల్

ఆమనగల్లు: రాష్ట్రంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు ఖిల్లా గోపాల్ డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన గొర్రెలు, మేకలు పెంపకందారులకు రూ.5 వేలు పింఛన్ అందించాలని అన్నారు. తలకొండపల్లిలో ఆదివారం గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడి లక్షలాది కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. వ్యవసాయ భూములు చిన్న కమతాలుగా ఏర్పడటంతో గొర్రెలు, మేకలకు మేత, నీరు లభించడం లేదని.. దీంతో గొర్రెలు, మేకలతో పెంపకందారులు వలస బాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ కారణాలతో మరణిస్తున్న గొర్రెల కాపరులకు బీమా అందించడం లేదన్నారు. గొర్రెల సహకార సంఘాలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించకుండా నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 50 శాతం సబ్సిడీతో గొల్ల, కురుమలకు గొర్రెల ఫాం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ముగిసిన లాటరీ ప్రక్రియ

- ఫార్మా ప్లాట్లు పొందిన 4,174 మంది రైతులు
- 2,602 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తి
- కబ్జాలు చూపించిన అధికారులు
- ఫిర్యాదులతో పలువురి రిజిస్ట్రేషన్ల నిలిపివేత
- ప్లాట్లు పొందినవారిలో ఆనందం



లాటరీలో వచ్చిన ప్లాటులో ఓ రైతు సంతోషం

యాచారం: రైతులు ఎన్నాళ్లుగానో ఎదురుచూసిన ఫార్మా ప్లాట్ల లాటరీ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. ఈ నెల 7 నుంచి 11 వ తేదీ వరకు ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేసి, మెగా వెంచర్‌లో కబ్జాలు చూపించారు. యాచారం, కందుకూరు మండలాల్లో ఫార్మా ప్లాట్లను 4,174 మంది రైతులకు అందజేశారు. కోల్పోయిన భూమిని బట్టి 60, 121, 181, 242, 302, 363, 423, 484, 544 గజాల చొప్పున ప్లాట్లను పంపిణీ చేశారు. మీరాఖాన్‌పేట టీజీఐఐసీ మెగా వెంచర్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన లాటరీ ప్రక్రియలో 2,602 మంది రైతులు పాల్గొన్నారు. వారికి ప్లాట్ల నంబర్లు తీసి, వెంటనే రిజిస్ట్రేషన్లు చేసి కబ్జాలను చూపించారు. దీంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

లాటరీలో పాల్గొనని 1,572 మంది

లాటరీ ప్రక్రియలో పాల్గొనాలని అధికారులు ఆయా గ్రామాల్లో ఒక రోజు ముందే పంచాయతీల వద్ద లిస్టులను ప్రకటించారు. అయినా 1,572 మంది రైతులు లాటరీ ప్రక్రియలో పాల్గొనలేదు. వీరిలో 700 మంది వరకు అథారిటీలో పరిహారం డబ్బులు జమ చేసిన రైతులు ఉన్నారు. అథారిటీలో పరిహారం డబ్బులు జమ చేసిన రైతులకు కూడా ప్లాట్లు కేటాయించినప్పటికీ లాటరీ ప్రక్రియలో పాల్గొనక పోవడం చర్చనీయాంశమైంది. వారంతా నకిలీలా.. లేక ఫార్మా ప్లాట్లను ముందే అమ్ముకున్నవారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలు గ్రామాల్లో అభ్యంతరాలు, ఫిర్యాదుల నేపథ్యంలో దాదాపు 25 మంది నుంచి 50 మంది రైతులను లాటరీ ప్రక్రియలో పాల్గొనకుండా అధికారులు నిలువరించారు. మరోవైపు గతంలో భూసేకరణలో కీలకంగా పని చేసి, అక్రమాలకు పాల్పడిన ఓ మాజీ రెవెన్యూ అధికారి చివరి నిమిషంలో తనకున్న పలుకుబడితో తన అనుయాయులను లాటరీలో పాల్గొనేలా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

❝ పక్కాగా పూర్తి చేశాం




పక్కాగా లాటరీ ప్రక్రియ పూర్తి చేశాం. కొందరు రైతులను లాటరీ ప్రక్రియకు అనుమతించొద్దని ఫిర్యాదులు వచ్చాయి. అలాంటి వారిలో 25 మందికి పైగా ఉంటారు. వారిని కార్యక్రమంలో పాల్గొనకుండా చేశాం. కొందరి నకిలీల ప్లాట్లను కూడా నిలిపేశాం. లాటరీ ప్రక్రియలో పాల్గొననివారిలో అర్హులెవరైనా ఉంటే ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో లాటరీ తీసి, రిజిస్ట్రేషన్లు చేస్తాం.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి



క్రీడాకారులకు బహుమతుల అందజేత

షాబాద్: క్రీడలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో 15 రోజులుగా ఎస్‌పీఎస్–3 క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, మల్లికార్జున ముత్య (అప్పాజీ) చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మొదటి స్థానంలో నిలిచిన కేకేఆర్ జట్టుకు రూ.లక్ష నగదు, కప్ అందజేశారు. రెండో బహుమతి గెలుచుకున్న ఢిల్లీ జట్టుకు రూ.50 వేల నగదు, కప్, మూడో స్థానంలో నిలిచిన సీఎస్‌కే జట్టుకు రూ.25 వేల నగదు, కప్‌ను అందజేశారు. నాలుగో బహుమతి గెలుచుకున్న ఎస్ఎస్‌జీ జట్టుకు రూ.15వేల నగదు, కప్ అందించారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాభివృద్ధికి రూ.850 కోట్లు కేటాయించారని తెలిపారు. మినీ స్టేడియాల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైన్‌షాప్‌లో చోరీ

షాబాద్: గుర్తు తెలియని వ్యక్తులు వైన్ షాప్‌లో చోరీకి పాల్పడ్డారు. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్‌లోని లక్ష్మీనర్సింహ వైన్స్‌లో అమ్మకాలు కొనసాగించిన నిర్వాహకుడు మహేందర్ శనివారం రాత్రి 10 గంటల తర్వాత దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం వైన్స్ పక్కనే ఉండే రాజ్‌కుమార్ దుకాణం వెనుక వైపు గోడకు పెద్ద రంధ్రం పడి ఉండడాన్ని గమనించి వైన్స్ యజమానికి ఫోన్ చేసి చెప్పాడు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రూ.15వేల నగదు, 12 విస్కీ బాటిళ్ల దొంగిలించి, మరో 20 బాటిళ్లను ధ్వంసం చేసినట్లు గుర్తించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. వైన్స్ యజమాని మామిడి విజయపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వైన్స్ వెనుక భాగంలో గోడకు చేసిన రంధ్రం

వ్యక్తి దారుణ హత్య

కొట్టి చంపిన భార్యాభర్తలు

మేడ్చల్‌రూరల్: భార్యాభర్తలు ఓ వ్యక్తిని కొట్టి చంపిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ చెందిన ఎదునూరి నరసింహ అలియాస్ చిన్న, తన భార్య అనితతో కలిసి మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని చెక్‌పోస్ట్‌లో ఉంటూ రోడ్డు పక్కన కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులను సేకరించి, అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. మెదక్ జిల్లా, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నర్సింలు (37) శనివారం మధ్యాహ్నం మేడ్చల్ చెక్‌పోస్ట్‌లోని వెంకటరమణ లిక్కర్ ల్యాండ్ వద్ద మద్యం తాగుతుండగా చిన్న, అతడి భార్య అనితతో స్క్రాప్ విషయమై గొడవ జరిగింది. దీంతో వారిద్దరూ కలిసి నర్సింహులును కర్రలతో కొట్టడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి దీనిని గుర్తించిన వైన్ షాప్ నిర్వాహకుడు మహేష్ మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


నర్సింహులు మృతదేహం


పోలీసుల అదుపులో నిందితులు

రోడ్డు ప్రమాదంలో కార్పెంటర్ మృతి

మేడిపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్, జైభవాని కాలనీకి చెందిన బ్రహ్మాచారి(55)కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం అతను బైక్‌పై పర్వతాపూర్ రోడ్డులో వెళుతుండగా ఆగ్రా స్వీట్ షాప్ ఎదురుగా డీసీఎం ట్యాంకర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తలరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ మహిళ మెడలోని చైన్ లాక్కెళ్లిన సంఘటనపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా, బీఎన్ రెడ్డి నగర్‌కు చెందిన ముక్క పద్మ తిరుపతి వెళ్లి కాచిగూడకు రైల్లో తిరిగి వస్తుంది. రైలు మహబూబ్‌నగర్ జిల్లా మణికొండ స్టేషన్‌లో ఆగగా గుర్తు తెలియని వ్యక్తి కిటికీలోంచి ఆమె మెడలోని 2 తులాల బంగారు గొలుసు లాక్కెళ్లాడు. బాధితురాలు ఆదివారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

చాక్లెట్లలో పురుగులు

జూబ్లీహిల్స్ పీఎస్‌లో కేసు నమోదు

బంజారాహిల్స్: తాను కొనుగోలు చేసిన డ్రైఫ్రూట్స్‌లో పురుగులు వచ్చాయని, ఇదే విషయాన్ని సదరు షాపు నిర్వాహకులకు తెలిపితే నిర్లక్ష్యంగా వ్యవహరించారని, సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాలని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మాదాపూర్‌లో నివసించే డాక్టర్ పెరూర్ పురేందర్‌రెడ్డి ఈ నెల 12వ తేదీన జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–36లోని పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న అజ్వాన్ ఇంటర్నేషనల్ రిటైల్ డేట్స్ అండ్ నట్స్‌లో డ్రై డేటెడ్ బ్లాక్, యూఎస్ఏ పిస్తా, యూఎస్ఏ వాల్‌నట్, ఆల్మండ్ డేటెడ్ చాక్లెట్స్‌తో పాటు మరికొన్ని డ్రైఫ్రూట్స్ కొనుగోలు చేశారు. ఇంటికి వెళ్లి చూడగా డేటెడ్ చాక్లెట్స్‌లో తెల్లని పురుగులు కనిపించాయి. దీంతో వెంటనే ఆయన సదరు షాపునకు వచ్చి సిబ్బందికి పురుగులు ఉన్న చాక్లెట్ చూపించాడు. షాపు సిబ్బంది ఏమాత్రం స్పందించకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజ్వాన్ ఇంటర్నేషనల్ రిటైల్స్ ఎల్ఎల్‌పీ మేనేజ్‌మెంట్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 125, 274, 275, 59 ఫుడ్‌సేఫ్టీ స్టాండర్డ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫిజిక్స్‌లో డాక్టరేట్

షాద్‌నగర్: ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి షాద్‌నగర్ పట్టణంలోని శ్రీనివాస కాలనీకి చెందిన పానుగంటి రాణి డాక్టరేట్ అందుకున్నారు. పానుగంటి రాణి విశ్వవిద్యాలయంలోని డిపార్టుమెంట్ ఆఫ్ ఫిజిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నథానియేల్ పర్యవేక్షణలో ఇన్వెస్టిగేషన్ ఆఫ్ స్ట్రక్చరల్ ఎలక్ట్రికల్ అండ్ మాగ్నెటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ రేర్ ఎర్త్ అంశంపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఓయూలో నిర్వహించిన కార్యక్రమంలో ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ ఎం.ప్రసాద్ చేతుల మీదుగా ఆమె డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం ఆమె కేశంపేట మండలం కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు.


పానుగంటి రాణి

రైలు కిందపడి వృద్ధుడి మృతి

శంకర్‌పల్లి: గుర్తు తెలియని వృద్ధుడు రైలు కింద పడి మృతి చెందిన సంఘటన మండలంలోని కొండకల్ గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. వికారాబాద్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఓ గుర్తు తెలియని వృద్ధుడు(60) ఆదివారం ఉదయం 11 గంటలకు కొండకల్ సమీపంలో రైలు కింద పడి మృతి చెందాడు. స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు వికారాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మార్చురీలో భద్రపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ట్రాక్ పక్కన పొదల్లో పడి ఉన్న మృతదేహం

వర్షాలు కురవాలని వరద పాశం


వరద పాశం పోసి తింటున్న రైతులు

షాబాద్: వర్షాలు కురవాలని మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామ రైతులు మల్లన్న గుట్టపై వరద పాశం పోసి వరుణదేవుడిని వేడుకున్నారు. మల్లారెడ్డిగూడ మల్లన్న గుట్ట మీద బండలపై ఆదివారం వరద పాశం పోసి తిన్నారు. ఈ సంవత్సరం వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.

మురుగు కాల్వల్లో వ్యర్థ జలాలు



వాయు కాలుష్యంపైనా పట్టింపు లేని పరిశ్రమలు

- పారిశ్రామిక వాడల్లో ప్రజల అవస్థలు
- తనిఖీల్లో బయటపడుతున్న లోపాలు
- మూసివేతకు పీసీబీ ఆదేశాలు

సాక్షి, సిటీబ్యూరో: పారిశ్రామిక వాడల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థ జలాల నిర్వహణ, వాయు కాలుష్య నియంత్రణ చర్యలు అంతంతగానే ఉంటున్నాయి. నిత్యం సాయంత్రం వేళల్లో, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజుల్లో కాలుష్య ఉద్గారాల విడుదల అధికంగా ఉంటుంది. సాధారణ రోజుల్లో సైతం హానికర వాయువులను విడుదల చేస్తుండటంతో కళ్లలో మంటలు, శ్వాసకోస సమస్యలు వస్తున్నాయంటూ స్థానికంగా నివాసం ఉండే ప్రజలు పీసీబీకి ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో పరిశ్రమలను సందర్శించి ప్రమాణాల మేరకు నిబంధనలు పాటిస్తున్నారా..? లేక డీవియేషన్స్ ఉన్నాయా అనేది పరిశీలిస్తున్నారు. నిబంధనలు పాక్షికంగా అతిక్రమించిన పరిశ్రమలను హెచ్చరించడం, మరికొన్ని సందర్భాల్లో పూర్తిగా మూసివేయాలని పీసీబీ అధికారులు ఆదేశిస్తున్నారు.

సాయంత్రమైతే ఊపిరాడదు..

బాచుపల్లి, బాలానగర్, బొల్లారం, పాశమైలారం, బొంతపల్లి, పటాన్‌చెరు, ఇస్నాపూర్, తదితర ప్రాంతాల్లో వాయుకాలుష్యం తీవ్రంగా ఉంటోంది. అదే సందర్భంలో పలు పరిశ్రమలు వ్యర్థ జలాల నిర్వహణలోనూ నిర్లక్ష్యం వహిస్తున్నాయన్న ఫిర్యాదులు అందుతున్నాయి. ట్యాంకర్లలో అర్ధరాత్రులు తరలించి ఊరి బయట ఖాళీ ప్రదేశాల్లో పారబోస్తున్నారు. దీంతో ఘాటు వాసనలతో ఆ దారిన పోయే వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గ్రేటర్ పరిధిలోని కొన్ని పరిశ్రమలు నేరుగా మురుగు, వరద కాల్వల్లోకి వ్యర్థ జలాల పైపులు వేస్తున్నారు. బూడిద వచ్చి ఇళ్లపై పడుతోందని, ఆరుబయట దుస్తులు ఆరబెట్టుకోలేని పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల బాలానగర్‌లో ఓ పరిశ్రమ యాజమాన్యంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమకు ఆనుకుని ఉన్న నాలాలో నేరుగా వ్యర్థ జలాలను విడిచిపెడుతున్నారని గుర్తించారు. ఘన వ్యర్థాలను దుండిగల్‌లోని టీజీడీఎఫ్‌కు తరలించడం లేదని, వ్యర్థాల శుద్ధి కేంద్రంలోనూ సభ్యత్వం లేదని తేలింది. దీంతో ఆ పరిశ్రమను మూసివేయాలని ఆదేశించారు. బాచుపల్లిలోని మరో పరిశ్రమ విపరీతంగా కాలుష్యాన్ని విడుదల చేస్తోందని గుర్తించిన పీసీబీ అధికారులు 2023లోనే పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. అయినా యాజమాన్యంలో మార్పు కనిపించలేదు. ఘాఢ వాయువులను శుద్ధి చేయకపోగా, వ్యర్థజలాలను ఆరుబయట పారబోస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పలు సందర్భాల్లో ఈ పరిశ్రమపై ఫిర్యాదులు వస్తున్నాయి. పునఃపరిశీలన చేసిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నారని, కాలుష్య నియంత్రణ పద్ధతులు పాటించడం లేదని గుర్తించారు. దీంతో పరిశ్రమను మూసివేయాలని ఆదేశించారు. ఇది ఇక్కడితో ఆగిపోదని, భవిష్యత్తులోనూ నిబంధనలు ఉల్లంఘించిన పరిశ్రమలపై కఠిన చర్యలు తప్పవని పీసీబీ అధికారులు హెచ్చరిస్తున్నారు.

జ్ఞానేశ్వర్ ఉద్యోగులకు స్ఫూర్తి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు

కుల్కచర్ల: మనసున్న అధికారులను ప్రజలు ఎప్పటికీ గుర్తించుకుంటారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు అన్నారు. గతంలో కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి మీర్‌పేట్ మున్సిపల్ కమిషనర్‌గా పదవీవిరమణ పొందిన రెడ్డిపల్లి జ్ఞానేశ్వర్‌కు ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రహ్లాదరావు మాట్లాడుతూ.. విధుల్లో అందరిచేత ప్రశంసలు పొందిన జ్ఞానేశ్వర్ ఉద్యోగులందరికీ ఆదర్శనీయమన్నారు. పదవీకాలం పూర్తయినా కొంత మంది ఉద్యోగులను ప్రజల మదిలో చిరకాలం గుర్తుండిపోతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సురేశ్, మంతయ్య, సంగప్ప, ప్రకాశ్, వీరేశం, ప్రసన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రహ్లాదరావు

డ్రంకెన్ డ్రైవ్‌లో 58 మందిపై కేసులు

కుత్బుల్లాపూర్: బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ పరిధిలో శనివారం నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 58 మంది వాహనదారులు పట్టుబడ్డారు. బాలానగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 15 మంది, జీడిమెట్ల పరిధిలో 20 మంది, ఆల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 23 మంది బ్రీత్ ఎనలైజ్ టెస్ట్‌లో అధిక మోతాదులో మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసిన పోలీసులు వాహనాలను సీజ్ చేశారు.

మహిళ అదృశ్యం

అల్వాల్: మహిళ అదృశ్యమైన ఘటన నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్ దీన్‌దయాల్‌నగర్‌లో నివసించే దాసాని రఘోత్తమ్‌రెడ్డి, భార్య సత్యలక్ష్మి (25)లకు తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈనెల 8న ఇంట్లో గొడవ జరగడంతో భార్య ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సత్యలక్ష్మి

లైన్‌మెన్‌కు బెదిరింపులు

- విద్యుత్ సరఫరా విషయంలో నోరుపారేసుకున్న పంచాయతీ కార్యదర్శి
- సోషల్‌మీడియాలో ఆడియోలు వైరల్
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

దోమ: విద్యుత్ సరఫరా విషయంలో ఓ లైన్‌మెన్‌పై పంచాయతీ కార్యదర్శి నోరుపారేసుకున్న ఆడియో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ ఘటన మండల పరిధిలోని ఐనాపూర్‌లో చోటుచేసుకుంది. విద్యుత్ లైన్‌మెన్ తెలిపిన ప్రకారం.. ఐనాపూర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండడంతో ఈడిగి భాస్కర్ గౌడ్(పంచాయతీ కార్యదర్శి, కుల్కచర్ల) లైన్‌మెన్‌కు ఫోన్ చేశారు. శనివారం సాయంత్రం దిర్సంపల్లిలో ఈదురు గాలులు రావడంతో గ్రామానికి చెందిన రాయికంటి అనంతయ్య ఇంటి వద్ద విద్యుత్ స్తంభంపై వైర్లు ఒకదానికి ఒకటి అంటుకోవడంతో మంటలు చేలరేగి విద్యుత్ అంతరాయం ఏర్పడిందని వివరించాడు. దీంతో ఊగిపోయిన పంచాయతీ కార్యదర్శి ఫోన్ కాల్‌లో లైన్‌మెన్‌తో బూతులు తిడుతూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో రమేశ్ సహచర లైన్‌మెన్‌లతో కలిసి ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

■ HMDA అప్రూవ్డ్ మహేశ్వరం మలబార్ గోల్డ్, విప్రో కంపెనీ మెట్రో రైలు దగ్గర న్యూవెంచర్లో ప్లాట్లు అమ్మబడును. బ్యాంక్ లోన్ కలదు. 8309376230 [SCA25006260]

HOUSE FOR SALE

■ Architect Constructed Ind House For Sale, 180 Sqyds. West Face. 3400 Sfts. GF. 2Bed Rooms. FF. 3Bed Rooms & Pent House, 9390805530, 6309409952, HMDA layout, Kundanpally, Rampally [SCA25006162]

LAND FOR SALE

■ ఈస్ట్ ఫేసింగ్ Rs. 7600 గజం 200 గజాలు 60 ఫీట్ల రోడ్డుకి 2వ ప్లాట్లు అమ్మబడును @ మహేశ్వరం, ఇండ్లకు దగ్గర DTCP ఫైనల్ అప్రూవల్. 9966521191 [SCA25006144]

PLOT FOR SALE

■ ECIL తుర్కపల్లి దగ్గరలో DTCP ప్లాట్స్, గజం : 7500/– బ్యాంక్ లోన్, EMI సౌకర్యం కలదు. LP No. 15172/584/2024/H, 9030181717 [SCA25006062]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ 9100329739 [H-800535]

PERSONAL CARE

LOST

■ I, D.Srinivasa Ramesh S/o D. Balakoteswararao, R/o. I-502, Aparna Sarovar, Nallagandla, Hyderabad 500019. My Sale Deed Document No: 8272/2003 of SRO Vanasthalipuram, Lost on 26th May while travelling from Rayannaguda to Turkyamjhal. Anyone found Pls Call 9949892222,9849022655 [HA-34898]

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S లగ్జరీ రూమ్స్, లిఫ్ట్ @ మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్, ఉప్పల్ & చీర్యాల్. మీన్స్ భోజన వసతి. 7981467036, 939103 9990, 6281125552 [H-783379]

■ ఒమేగా హోంకేర్ ఇంటి / వంటపనికి వృద్ధులను పేషెంట్లను చిన్న పిల్లలను 24 గం.లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్ టేకర్స్‌ను పంపబడును. Hyd. ఫోన్ 9963114535 [SCA25006197]

Wanted

■ జూబ్లీహిల్స్, మాదాపూర్ ఏరియాలలో పనిచేయుటకు అర్జెంట్‌గా సెక్యూరిటీ గార్డ్స్ స్త్రీ/పురుషులు కావలెను. Ph: 9177155066, 7075906661 [HA-1414]

■ HYD ప్రముఖ రియల్‌ఎస్టేట్ కంపెనీ నందు అప్రూవ్డ్ ప్లాట్లు మార్కెటింగ్ చేయుటకు లేడీ టెలికాలర్స్, టీం లీడర్స్ & ఎగ్జిక్యూటివ్స్(M/F) కావలెను. కమీషన్ ఇవ్వబడును. 7287940345 [G-80]

■ క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ HYD ఆటో నగర్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పని చేయుటకు 10th ఆపై చదివి 30 సం॥ లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. సంప్ర: Ph No: 87901 91999 [B-3]

■ Wanted Residential Driver cum Watchman (only Family) Masters Concept High School Osmanpura, Chaderghat, Hyderabad. 9246369342 [HA-1422]

■ Managers, Officers, law/IT Officers with experience (including retired) may apply to work in Bhadradri Co-op Urban Bank Ltd, Khammam at various locations. Refer website www.bhadradribank.com. last Dt. 31-7-2025. Ph: 96033 66343 Hr@bhadradribank.com [MH 13721]

■ Waves water purifier co. Req. Male sales executives, service technicians & lady Telecallers. Ph: 6281547216 / 9502536969 [HA-16222]

■ Wanted Auto Driver Cum Delivery Boy 5 nos Salary 15K+ Accommodation and food, Sales Executives 5 nos 18K+ Accommodation and food for FMCG Company at Jalpally Preference will be given for scooter owners Hyderabad. Ph: 8367676262, 9885624923, 8978662887 [HA-5441]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు | జోన్ సెంటర్స్
క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-246/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

పేకాట రాయుళ్ల అరెస్ట్

రూ.4 లక్షల 54వేలు స్వాధీనం

మీర్‌పేట: పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని మీర్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. బడంగ్‌పేట ఆర్ఎంఆర్ కాలనీలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ బృందంతో కలిసి దాడి చేశారు. 8 మందిని అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి రూ.4 లక్షల 54వేలు, 8 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మియాపూర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ మెట్రోస్టేషన్ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడని ఆదివారం ఉదయం మియాపూర్ పోలీసులకు మెట్రో సిబ్బంది సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా ఆ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. చుట్టుపక్కల విచారించగా సమాచారం లభించలేదు. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని పోలీసులు ప్రాథమిక అంచనాలో తేలింది. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భాయ్ బచ్చా ఆగయా..

కోడ్ భాషలో డ్రగ్స్ కస్టమర్లతో సంప్రదింపులు

- రెక్కీ చేసి రెండు గంటల్లో 14 మందిని పట్టుకున్న పోలీసులు
- భార్య, నాలుగేళ్ల కుమారుడితో కలిసి గంజాయి కొనేందుకు వచ్చిన కస్టమర్
- ఐటీ ఉద్యోగులే లక్ష్యంగా డ్రగ్స్ దందా



సాక్షి, సిటీబ్యూరో: భాయ్ బచ్చా ఆగయా.. ఇలా కోడ్ లాగ్వేజ్ లో డ్రగ్స్ కస్టమర్లను సంప్రదిస్తూ దందా సాగిస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు సైబరాబాద్ పోలీసులు. మఫ్టీలో రెండు గంటల పాటు రెక్కీ చేసిన సైబరాబాద్ నార్కోటిక్ పోలీసులు (ఈగల్) ఏకంగా 14 మంది నిందితులను అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్ర కు చెందిన సందీప్ అనే డ్రగ్ పెడ్లర్ తరచూ గచ్చిబౌలిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో కస్టమర్లకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు ఈనెల 12న పోలీసులకు సమాచారం అందింది. దీంతో రెక్కీ నిర్వహించిన పోలీసులు గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన నవీన్, ఆయుష్, నిఖిల్, సింధూర, హసన్, క్రాంతి, అఖిల్, శివ, సందేశ్, సాయి రాజ్, అఖిల్, స్వామి, తుషార్, అర్పిత్ లను అరెస్టు చేశారు.

భార్య, కొడుకుతో సహా...

పోలీసులకు చిక్కకుండా పలువురు డ్రగ్స్ కస్టమర్లు చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. ఓ డ్రగ్ కస్టమర్ భార్య, నాలుగేళ్ల కుమారుడితో సహా డ్రగ్స్ కొనుగోలు చేసేందుకు వచ్చాడు. కానీ అప్పటికే పోలీసులు అతనిపై నిఘా వేసి పట్టుకున్నారు. అయితే అతని భార్య, కుమారుడికి డ్రగ్స్ యూరిన్ డ్రగ్ పరీక్షలు నిర్వహించగా నెగెటివ్ రావడంతో వదిలేశారు. మరో డ్రగ్ కస్టమర్ భార్యతో సహా మాదక ద్రవ్యాలు కొనేందుకు వచ్చి పోలీసులకు చిక్కారు. పరీక్షల్లో ఇద్దరికీ పాజిటివ్ రాగా పోలీసులు ఇద్దరినీ అరెస్టు చేశారు.

50 గ్రాములు రూ.3 వేలు

ప్రధాన నిందితుడు మహారాష్ట్ర నుంచి 5 కిలోల గంజాయి ప్యాకెట్లుగా అక్రమ మార్గంలో హైదరాబాద్ తీసుకొస్తున్నాడు. ఒక్కో ప్యాకెట్ (50 గ్రాములు) రూ.3 వేలకు విక్రయిస్తున్నాడు. వాట్సాప్ ద్వారా "భాయ్ బచ్చా ఆగయ్యా లాంటి కోడ్ మెసేజ్‌లు పంపుతూ కస్టమర్లతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. అతడి వద్ద 100 మందికి పైగా కస్టమర్ల డేటాబేస్ ఉన్నట్లు గుర్తించారు. ప్రధాన నిందితుడైన సందీప్ పరారీలో ఉన్నా, అతని మొబైల్ డేటా, వాట్సాప్ చాటింగ్‌లు, కస్టమర్ నెంబర్లను ఆన్‌లైన్ ట్రేస్ చేస్తూ పెద్ద నెట్‌వర్క్‌ను ఛేదించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మిగతా 86 మంది వినియోగదారుల వివరాలు వెలుగులోకి రావడంతో వారిని డీ అడిక్షన్‌కు కేంద్రాలకు పంపించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

భళా.. చేనేత హస్త కళ

పలు రాష్ట్రాల సంప్రదాయ దుస్తుల విక్రయం

తాండూరు టౌన్: పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో చేనేత హస్త కళ ప్రదర్శన విక్రయాలు ప్రారంభమయ్యాయి. దేశంలోని పది రాష్ట్రాలకు పైగా అక్కడి సంప్రదాయ చేనేత కళలకు సంబంధించిన దుస్తులు, పలు రకాల వస్తువుల విక్రయానికి ఉంచారు. కాటన్ షర్ట్స్, కుర్తీ, హ్యాండ్ బ్యాగ్స్, స్టోన్ జువెల్లరీ, చీరలు, కొయ్య బొమ్మలు, బెడ్ షీట్స్, టవల్స్, బొమ్మలు తదితర చేతివృత్తి ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. వచ్చే నెల 3వ తేదీ వరకు ప్రదర్శన, విక్రయాలు కొనసాగుతాయని నిర్వాహకులు చెబుతున్నారు.


చీరలు కొనుగోలు చేస్తున్న మహిళలు

మూడు ట్రాక్టర్లు సీజ్


పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్ర మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రమేశ్ తెలిపిన ప్రకారం.. శనివారం రాత్రి ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్ర మట్టిని తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. పోలీసులు అక్కడి చేరుకుని వాహనాలు నిలిపి తనిఖీలు చేపట్టగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో కాటనిపలి అంజిలయ్య, ఈడిగెళ్ల బాబు, శివని ఎల్లయ్యకు చెందిన మూడు ట్రాక్టర్లు సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.